# లోకం తీరు



## కౌసల్యాదేవి రామమూర్తి

నలుగురూ డ్రాయింగ్‌రూమ్‌లో సమావేశమైన వేళ ఏదో ఒక అంశం చర్చనీయం కాకమానదు.

"వచ్చేనెల మొదట్లో వెళ్తున్నాను మా వూరు" అన్నాడు గోపాల్.

"అయ్యో! అయితే మన సమావేశాలు రద్దుకట్టవుగా? ఎన్నాళ్ళు మహానుభావా?" విశ్వం అడిగాడు.

"పదిహేను రోజులు. ఇప్పుడు. మా చెల్లెలి పెళ్ళి."

"అంతేనా? నీ పెళ్లికే వెళ్తున్నావా?" అనుమానంగా అడిగారు మిత్రులంతా;

తన పెళ్ళే అయితే గ్రాండ్‌గా ఠీవిగా వెళ్తాడు, దాపరికం దేనికి?" కాఫీలు అందిస్తూన్న విమల అన్నది

"మీకు తెలియదులెండి," విశ్వం అన్నాడు: "వాళ్ళలో కట్నాలూ కానుకలూ మహా లావు. అందులోనూ మనవాడు అందగాడూ ఉద్యోగస్థుడూ కదా! ఓ లక్షన్నర లేనిదే అందడు. మనకు పార్టీలవీ ఇవ్వాలేమోనని గప్‌చిప్‌గా తుర్రుమంటున్నట్టున్నాడు."

"అయ్యబాబోయ్ నిజమే?"

"పెండ్లి ఔతూనే మనవాడు లక్షాధికారి అయిపోతాడా? ఎంతదృష్టం!"

"నేనూ మీ కులంలో జేరిపోతానోయ్ గోపాల్. చక్కగా బిజినెస్ చేసుకోవచ్చు పెళ్లి అవుతూనే, ఈ నౌఖరీ వదలి."

రకరకాల పరిహాస్యాలూ, కామెంట్సూ వర్షంలా కురిశాయి కొంతసేపు.

ఆ వర్షం కాస్త తెరిపి యిచ్చింది.

"గోపాల్! మేమందరం యిన్ని మాటలాడినా అలా చిరునవ్వుతో చిద్విలాసంగా కూర్చున్నావేమిటి?"

విశ్వం ప్రశ్నకు మరింత చిరునవ్వు లొలికించాడు గోపాల్.

"మీ ఊహాగానాలే కానీ, నన్నేమైనా మాట్లాడనిచ్చేరా మీరు?" ఎదురు ప్రశ్నించాడు.

"పోనీ యిపుడు మాట్లాడు మహానుభావా!" హాస్యంగా చేతులు జోడించాడు రమణ.

గోపాల్ అన్నాడు; "నే నిపుడు వెళ్లేది మా చెల్లెలి పెండ్లికే. యాభై వేల రొఖ్ఖం, యాభై వేల నగలూ, ఓ యిరవై వేలవరకూ పెండ్లి ఖర్చు అని వ్రాశారు మా నాన్నగారు."

"బాప్‌రే! మీ చెల్లెలు ఏమీ చదువు...." అర్ధోక్తిలో ఆగిపోయింది విశ్వం ప్రశ్న.

"నీ సందేహం— మా చెల్లికి చదువు లేదా అని. అది నిరుడే ఎమ్మే పాసైంది. అయినా కట్నం తప్పదు."

"ఉద్యోగం చేసే అమ్మాయి అయినా సరేనా?" అంతవరకూ మౌనంగాకూర్చున్న లక్ష్మి అడిగింది.

"ఆహా! ఆవిడ ఉద్యోగం చేసి సంపాదించే ఆవిడ అయినా సరే, పెద్ద డాక్టరో, ఇంజనీరో అయినా సరే!"

"అందంగా వున్నా సరేనా?" మరొకరి సందేహం.

"ఆఁ! సాధారణంగా పెద్ద మార్పేమీ వుండదు!" గోపాల్ సమాధానం.

"బాబోయ్! అయితే మీలో చాలామంది ధనవంతులే వుంటారన్నమాట?" విమల అడిగింది.

"అదేమో తెలియదు కానీ, చాలామంది

కన్యలకు అలస్యంగా పెండ్లి ళ్లు కావడం, మరింకా చాలా మంది అవివాహితలుగానే వుండిపోవడం జరుగుతోంది."

కొద్దిసేపు అందరూ వదనముఖాలు చూచుకున్నారు.

"ఇంతకూ నువ్వు ఏన్ని లక్షలలో వున్నావ్?" హఠాత్తుగా అడిగాడు విశ్వం.

అందరూ కుతూహలంగా చూస్తున్నారు గోపాల్ సమాధానం కోసం.

చిరునగవుతో నిదానంగా అన్నాడు గోపాల్;

"నేను అందాల నగరిలో వున్నాను. లక్షలలో లేను."

"అంటే?"

"అరె. ఆ మాత్రం అర్థం కాదా? నాకు అందమైన అమ్మాయి ప్లస్ చదువు వుంటే చాలు. నో మనీ బిజినెస్.'

"కాయ్ కోతలు." రఘు నమ్మలేనట్లు అన్నాడు.

"వారెవ్వా. ఏం నీతుల ?నమ్మమనేనా" విశ్వం విరగబడి నవ్వుతున్నాడు.

అంత వరకూ మౌనంగా వింటూన్న వెంకటేశ్వర్రావూ, రాఘవ్ కూడ శృతి కలిపారు, "మేం నమ్మం" అంటూ.

"ఏం? ఎందుకు నమ్మరు?". గోపాల్ ఎదురు ప్రశ్న.

"కొయ్యకోయ్. ఎవరికి తెలియదుగనుక? తీరా ఆ సమయం వచ్చే సరికి అమ్మానాన్న పట్టు పట్టి నిర్ణయించేశారనే ప్రబుద్ధులనూ, మరెవరో మునసమ్మ మలమలా మాడి చస్తానని బెదిరించిందని వంకపెట్టే మహానుభావులనూ ఎందరిని చూడడంలేదు? మాటలలోనే ఆదర్శాలు."

"మీ చెల్లికి లక్షపైగా యిస్తూన్న మీ నాన్నగారు నీకు రెండుపైగా వసూలుచేస్తారనేది నిస్సంశయం."

"పెద్దల పెత్తనమైతే షరామామూలే. కానీ నాకూ కొన్ని అభిప్రాయాలు వుంటాయిగా?"

"అయితే ఈ సరికే నీ వివాహమైపోయి వుండాలి. యింతకాలం బ్రహ్మచారిగా ఎందుకున్నావ్? పెద్దమొత్తం కసమేగా?"రాఘవ్ అన్నాడు.

"బాగున్నాయి నీ యక్ష ప్రశ్నలు. ఇది వరకే ఎందుకుఅయిపోవాలి చెప్పు?" గోపాల్ చిరు కోపంతో అడిగాడు.

"కట్న కానుకలు అక్కరలేని అందగాడూ, ఉద్యోగస్థుడూ అంటే కోటిమంది ఆడపిల్లల తండ్రులు వచ్చి పాదాలపై వాల్తారు. ఇలా వదిలే వారేనా నిన్ను?"

"పూర్ బోయిస్" అంటూ జ్ఞాని వలె నవ్వాడు గోపాల్." మీరుఅందరూ నాకంటె కొంత పెద్దవారూ, వివాహితులైన అనుభవజ్ఞులూ అని అంగీకరిస్తాను కానీ, ఈవిధమైన లౌకిక జ్ఞానంలో మాత్రం నా కంటె తీసికట్టే."

"అంటే ఏమిటో వివరించరాదూ?

"వర కట్నాలు ఆకాశాన్నంటుతూన్న ఈ రోజులలో పైసా లేకుండా దొరికే వరుడు-అందునా రూపసీ ఉద్యోగస్థుడూ-అనుమానంగా చూడబడతాడు; వీడికేమి లోపముందోనని భగవంతుడా-అనుకుంటారు అంటే నమ్ముతారా మీరు?"

"బడాయి!" రాఘవ్ అన్నాడు.

"మరీ చోద్యంగా మాట్లాడకు." విశ్వం మాటలు యివి.

"చెప్పానుగా మీరు నమ్మరని. కాని నా అనుభవాలు అవి, అబద్ధం కాదు. అయితే ఒకటి-నా భాగస్వామిని అందం, విద్య విషయంలో నాకు కొన్ని అభిప్రాయాలున్నాయి. ఆమెకు మాస్టర్ డిగ్రీ వుండాలి; అద్వితీయ సౌందర్యవతి కూడా అయి వుండాలి. ఈ నా అభిరుచికి సరిపడిన అమ్మాయిలు యిద్దరు తారసపడ్డారు. ఒకరు యూనివర్సిటీలో; మరొకరు మా దూరపు బంధు బలగంలో."

'ఊc. అయితే?' అందరూ ఏకకంఠంతో అడిగారు.

"ఆ యిరువురికీ-లేదా వారి పరిజనానికి కొన్ని అనుమానాలు-నేను చెప్పిన అనుమానాలు 'కలిగి వాళ్ళు నాపై నిఘా వేయడం నచ్చని పని చేయడమూ, నాకు తెలిసి అసహ్యించుకొని ఆ సంబంధం వదలుకోవడమూ జరిగింది."

కొంత తడవు ఎవ్వరూ మాటలాడక మౌనంగా గడచి పోయింది.

విమల అన్నది: "వాళ్ళెవళ్ళో బొత్తిగా మూర్ఖులు, అందుకని మీరు వివాహమే మానుకున్నారా?"

గోపాల్ సగర్వంగా భుజాలెగరేస్తూ అన్నాడు:

"అటువంటి దేమీలేదు, అన్వేషణ సాగుతూనే వున్నదనుకోండి. అలాగని వివాహం కోసం తపించి పోవడమూ లేదు. మీరు కట్నాచారాలమూ, వరులనూ మాత్రం దుయ్యబట్ట వద్దంటున్నాను. దురాచారం మాపవలెననే సదుద్దేశ్యంతో ముందుకు వచ్చే చేయూత నీయగల యువకుల నెందరు అర్థం చేసుకొంటున్నారు? అవకాశం దొరికినా సద్వినియోగం చేసికొనగల కనీస సంస్కారమైనా వున్నదా అధిక శాతం యువతులకు? అని అడుగుతున్నాను."

"మీ అపోహలను నేను తొలగించినా?" విమల అడిగింది.

"ఎలా?"

"మీకు కావలసిన అర్హతలు గల అమ్మాయి మా వద్ద వున్నదనుకోండి, వరకట్నం లేకుండా మీరు వివాహమాడేందుకు సిద్ధమేనా?"

"అందం నాకు నచ్చాలి." స్థిరంగా అన్నాడు గోపాల్.

"నచ్చితేనే, కాపీ చెప్పగలను. మరే కాదు-ఆ బ్రహ్మకూడ వంక లెన్నలేని అప్సరస; చదువు ఎమ్మే."

"అలాగయితే సరే."

"ఇదుగో. ఇందుకు మీరే సాక్ష్యం." విమల నవ్వుతూనే అన్నది అక్కడ సమావేశమైన అందర్నీ ఉద్దేశించి.

"ఉండండి, ఇపుడే వస్తాను." లోనికి వరుగెత్తి అయిదు నిముషాలలో పెద్ద ఆల్బమ్‌తో తిరిగి వచ్చింది విమల ఒక ఫోటో చూపుతూ "ఇదుగో. మా బాబాయి గారి అమ్మాయి లీల. నాకు స్వంత చెల్లి కంటె ఎక్కువ." అన్నది.

"అయితే?"

"అమెయే పెండ్లి కుమార్తె మహాశయా, చూడండి" చేతిలోవుంచిందిఛాయాచిత్రాన్ని. గోపాల్ తదేకంగా రెండు నిముషాలు చూచాడు.

"నిజానికి కూడాయింత అందంగా వుండాలి. కొందరు ఫోటోలో మాత్రమే బాగుంటారు."

సమాధానం విమల భర్త రావు నుంచి వచ్చింది.

"ఆ హామీనేను యిస్తున్నాను. మా మరదలి అందాలను పూర్తిగా బంధించగల కెమెరా లేదు మరి."

అందరి నవ్వులతో ఇల్లు మార్మోగింది.

"మరైతే రాయబార నడిపే అనుమతి లభించిందిగా?" విమల అడిగింది.

"ఓయస్!" సవిలాసంగా సిగరెట్ పీలుస్తూ అన్నాడు గోపాల్.

"కట్నం ఆశ లేనట్టేగా?" విమల మరో సారి ధృవీకరించడానికి అడిగింది.

"లేదండీ బాబూలేదు కావాలంటే వ్రాసి స్టాము కాగితం, కలం రెవిన్యూ స్టాంపూ తీసుకు రండి."

"అక్కర్లేదు కానీ.......మనం పందెం వేసుకున్నాం కదూ? మీ పందెం ఎంత?"

విమల సీరియస్ గానే అడిగింది.

"ఎందుకేమిటీ?"

"ఎందుకా? మీ అపోహలు తొలగించి మీకు చక్కటి అమ్మాయితో పెళ్ళి జరిపించేందుకు."

అందంగా నవ్వాడు గోపాల్.

"ఓ రెండు వేలతో చక్కటి జరీ పట్టు చీర. సరేనా!"

"ఓ." సంతోషంగా అంగీకరించింది.

"మరి మీరు ఓడిపోతే!" గోపాల్ కొంటెగాఅడిగాడు.

"ఆ ప్రసక్తే లేదు" బింకంగా అన్నది.

"ఎవరు చెప్పగలరు? వున్నదే అనుకోండి. షరతులు ఖచ్చితంగా వుండాలి మరి!"

"ఔను, గోపాల్ మాట సబబే." అంతా సమర్థించారు.

"అయితే అదీ మీరే చెప్పండి." విమల సీరసంగా అన్నది.

"నేను ఓడితే మీకు రెండువేలు యిస్తానన్నాముగా? మీరు ఓడితే వెయ్యిమాత్రమే నిర్ణయించుదాం పోనీ, లేడీస్‌కి కన్సెషన్ వుండాలిగా?"

విమలకు పౌరుషం కలిగింది.

"ఏమీ కన్సెషన్ అక్కరలేదు. నేనూ రెండు వేలు యివ్వగలను కాని చూస్తూం డండి_మీరే ఓడిపోతారు. ఇటు మీ నుండీ, అటు మంచి సంబంధం కుదిర్చి నందుకు బాబాయి నుండీ కూడ వసూలు చేస్తాను."

"చూద్దాంగా"

2

"లెటర్. మా బాబాయి దగ్గర్నుంచే,"

భోజనం మధ్యలోనే లేపిగెంతుతూ వెళ్ళి ఎంగిలి చేతి తోనే కవరు విప్పింది విమల.



"రెండువేలు కొట్టేశావన్న మాటేనా?" డైనింగ్ టేబుల్ దగ్గర నుంచి నవ్వుతూ అడుగుతున్నాడు వెంకటేశ్వర్రావు.

సమాధానం కూడ ఆయక లేఖ గబ గబా చదివేసిన విమల ముఖంలో కాంతి కళా తరిగి పోయాయి.

"ఏమిటోయ్ అదీ?" వెంకటేశ్వర్రావు భోజనం ముగించి వచ్చి ఆ ఉత్తరం తన చేతికి తీసుకుని చదువు తూనే విరగబడి నవ్వాడు.

"రెండువేలూ గోవిందా, గోవిందోహరి. గోపాల్ సరిగానే అంచనా వేశాడు ఈ లోకాన్నీ సంఘాన్నీ." మరింత విరగ బడి నవ్వసాగాడు చిన్నబోయిన విమల వదనాన్ని చూచి,

"చిరంజీవివి విమలకు,

ఆశీర్వాదాలు; ఉభయ కుశలోపరి మన లీలకు నీవు రాసిన సంబంధం గురించి ఆలో చించ వలసిన అగత్యమేమీలేదు. నాకేగాదు మీ పిన్నికి గానీ యింట్లో మరెవరికి గానీ ఈ సంగతి యిష్టంలేదు. మామూలు గుమా స్తాలే పాతిక_ముప్పైవేల కట్నం గుంజా

తూన్న ఈ రోజులలో ఆఫీసర్ హోదాలో వున్న వాడూ ఆస్తిపరుడూ చిల్లిగవ్వకూడ లేకుండా వివాహం ఎందుకు చేసుకుంటాడు వెనుక ఏ లొసుగూ లేకుంటే? అటువంటి వాళ్ళు చాలా గ్రంథసాంగులై వుంటారు. లోగడనే ఏ రిజిష్ట్రి పెళ్ళైనా అయ్యిందో లేక ఏ మచ్చ వున్న కుటుంబమో. అతడిలో ఏమైనా లోపం వున్నదో- కాస్తయినా ఆరా తీయి. అతడి వూరూ, పేరూ తండ్రి పేరు వగైరాలవీ వ్రాయి. నేను కాస్త భోగట్టా చేస్తాను. అయినా అసలంత అవసరం లేదనుకో. ఎటూ లీలకు నేను డెబ్భై వేల వరకూ కట్నం యివ్వ దలచుకున్నాను గదా! అంతగా అయితే లక్ష పూర్తి చేసి మంచివాడినే తెస్తాంగానీ ఇలాంటి కక్కుర్తి సంబంధాలు వద్దు, అల్లుడి గార్ని అడిగినట్లు చెప్పు.

— "చలపతి"

భార్యాభర్తలిరువురి ముఖాలకి కత్తి వేటుకు నెత్తురు చుక్క లేదు.

"గోపాల్ మనుష్యులను బాగానే చదివాడు" అన్నాడు మరొకసారి వెంకటేశ్వరరావు.

చాలాసేపు మౌనంగా గడిచిపోయింది

"ఏమిటలా డీలా పడిపోయావు? గోపాల్‌కు రెండు వేలు ఎలా యివ్వడమా అనా? ఓ గాజో గొలుసో అమ్మేస్తే. ఏం చేస్తాం?"

ఉక్రోషంగా చూసింది విమల.

"నేనొక్కసారి వెళ్ళిరానా మా వూరు, నిక్షేపం లాంటి సంబంధం వదులుకుంటు న్నారు."

"చాల్లే, కందకు లేని దురద బచ్చలి కట! నీ నిక్షేపాన్ని మించిన నిధిని దేన్నో అతడు తన డబ్బుతో తన కూతురికి సంపాదించ గలనని ధీమాగా చెప్తుంటే, నీ దేవిరింపు దేనికీ మధ్యనా?"

"అయినా ఈ మాట గోపాల్‌కు ఏ ముఖంతో చెప్పేది? నవ్వడూ! ఆనాడు అందరిలో ఎంతో గర్వంగా చెప్పాను; నవాలు చేశాను. అందరూ ఎంత ఎగతాళి చేస్తారు,"

"ఎందుకు చెయ్యరూ? బాగానే చేస్తారు. అయినా తగుదునమ్మా అంటు ముదిపేరక్కలాగా నిన్ను పెళ్ళి బేరాలు, పెద్దరికాలూ ఎవరు చేయమన్నారు? ఇకనైనా బుద్ధి తెచ్చుకో."

విమలకు కండ్లనీళ్ళ పర్యంతమైంది.

"చాల్లెండి, అన్ని విధాలా చిక్కు ప్రశ్న లెదురైతే, ఉపాయం ఆలోచించక పైగా సాధింపులేమిటి!"

"ఓహో! అయితే నిజంగా ఉపాయం ఆలోచించమంటావా?"

"బాబ్బాబూ, అంతకంటేనా? మీకు పుణ్యముంటుంది."

"యేమో, మీ బాబాయి అసలే అనుమానం పిశాచంలా భూతంగా వున్నాడు. అనక ఏమైనా చిన్న చిన్న తేడాలున్నా నన్ను నిందించకూడదు."

"అంటే! ఏం తేడాలూ?"

"వద్దులే. అవన్నీ ఎందుగ్గానీ- గోపాల్‌కు తన అభిరుచులకు తగిన అమ్మాయిని ఎన్నుకోగల సామర్థ్యమున్నదిలే. అతడి కోసం మనకు బెంగ ఎందుకు గాని - మీ చెల్లాయికి చక్కటి అబ్బాయిని చూపనా! మీ బాబాయి డబ్బు కూడా సార్థకం చేసే అబ్బాయి వున్నాడు!"

"అయ్యిందిగా ఒక చెప్పు దెబ్బ? మరొకటికూడా ఎందుకు లెండి. చెయ్యగలిగితే ఈ గోపాల్‌కే లీలను కుదర్చగలగాలి. పరువు నిలుస్తుంది."

"అది మాత్రం నావల్ల కాదు. అసలు ఈ విషయమే నేను గోపాల్‌తో చెప్పలేను."

నిస్పృహతో చూచింది విమల.

## 3

"హల్లో. ఎవరూ విమలేనా?"

"ఔను. నేనేనండీ. ఇంట్లో మహా యింకెవరున్నారని మీ కా సందేహం?"

వెంకటేశ్వరరావు తమాషాగా నవ్వాడు.

"నేను ఆఫీసు హడావుడిలో ఏదో యథాలాపంగా అన్నానే అనుకో. నీకంత కోపమెందుకూ? అసలు దగ్గ రెండువేలు పోతున్నాయే అని. ఆ విషయం ఆలోచిస్తూండగా నేను ఫోన్ చేశాననుకుంటాను. సారీ!"

"చాల్లెండి మీ టీజింగ్. ఇంతకూ ఏమిటి పావం, ఆఫీస్ అవర్స్‌లో నేను గుర్తుకొచ్చాను?"

"సాయంత్రం నాలుగ్గంటలకు నేను వచ్చేస్తున్నాను. నా సూట్‌కేస్, బెడ్డింగ్ సిద్ధంగా వుంచు."

"కేంపా? ఎక్కడికి?"

"నేనూ, నా కొలీగ్ మరొకతడు విజయ్. ఇద్దరం ఓ వారం రోజులు ట్రిప్."

"విజయ్! ఇతడెవరు?"

"వారంరోజుల క్రిందట వచ్చాడులే హెడ్ ఆఫీస్‌నుండి."

"ఇంతకూ ఏ ఊరు?"

"కాకినాడ!"

"దారుణం! ఈ మాట ఇంత నెమ్మదిగా- ఆలస్యంగా చెబుతున్నారా? మా ఊరు నేనూ వస్తానని తెలియదూ?"

"ఎప్పుడూ వస్తూనే వున్నావుగా? ఈ సారికి అదేమీ కుదరదు. మేం అర్జంటుగా వెళ్ళాలి."

"అలాగంటే ఎలాగ!" విమల కంఠం దుఃఖంతో వణికింది. "అఫీషియల్ ట్రిప్ అయినా, నా ఖర్చు మనమే పెట్టుకుంటాంగా? ఇలా ఎన్నిసార్లు నేను మీతో రాలేదు?"

"అందుక్కాదు, నా వెంట క్రొత్త మనిషి....విజయ్ వున్నాడు కదా!"

"అయితే మనకేం? మా వాళ్ళను చూచినట్లూ వుంటుంది. అదీకాక మా బాబాయితో స్వయంగా మాట్లాడి....లీల పెండ్లి ...."

"ఆఁ ఆఁ. తెలుసు తెలుసు. అందుకే వద్దంటున్నాను. ఆయన కూతురి పెండ్లి కోసం మధ్యన నీ తహతహ దేనికి?"

"అయ్యో! తెలియనట్టు మాట్లాడతారేం? రెండువేలు పందెం...."

"గోవిందో హరి. ఫర్వాలేదులే. రెండు వేల పందెంకంటే రెండుకోట్లను మించిన ఆత్మాభిమానం ప్రధానం. మనకు ఎవర్నీ బ్రతిమాలే ఖర్మ పట్టలేదు."

"ఏమిటీ రోజు యింత ఖండితంగా మాట్లాడుతున్నారు?"

"అదంతే, పెట్టేయి రిసీవర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజి వాళ్ళు వార్నింగ్ యిచ్చే ప్రమాదం వుంది."

## 4

చలపతి రాకను చూచీ గమనించనట్లే వెంకటేశ్వరరావూ, విజయ్ తమ ఆఫీసు సంభాషణలలో మునిగి పోయి వున్నారు.

"ఏం అల్లుడుగారూ, వచ్చిరెండు రోజులైందట. మా యింటి వేపు వచ్చారు కాదేం?" తానే పలకరించుతూ వచ్చాడు చలపతి.

"ఓ! మీరా?" అప్పుడే చూచినట్లు లేచి నిలబడ్డాడు చలపతి.

"ఏదో ఆఫీసు పని మీద వచ్చాము లెండి ఇంకా ఎక్కడా, తిరలేదు.........ఇతడు నా

తోనే వర్క్ చేస్తున్నాడు, విజయ్ ఇద్దరమూ వచ్చాం."

"విమల రాలేదేం?"

"టైమ్‌లేకపోయింది. అర్జంట్ ట్రిప్..." నడిచాడు వెంకటేశ్వర్రావు.

"నేనలా తిరిగి, పూనా చూచి వస్తాను వెంకటేశ్వర్రావ్." అంటూ విజయ్ వెళ్ళిపోయాడు.

"ఎవరేమిటీ కుర్రాడు? చాలా పెక్యులిగా వుండే వ్యవహారం! పెద్దవాళ్ళకు ఓదణ్ణం పెట్టే సదాచారం కూడా లేదు." "అన్నట్టూ ఆ మధ్య విమల వ్రాసింది ఎవరో అబ్బాయి పెండ్లికి వున్నాడనీ-లీలను ఇమ్మనీని."

"ఆం! లీల కోసమా?' జ్ఞాపకం చేసుకుంటువ్వట్లు ముఖం పెట్టాడు వెంకటేశ్వర్రావు.

"అదే, అతగాడికి కట్నం అదీ వద్దనీ- ఏమి లొసుగు లున్నాయో అని భయం వేసింది నాకు."

"ఇటువంటివి చేసి దెబ్బ తింటామని భయం వేసింది. అదే రాశాను విమలకు. అయినా తెలిసున్న వాడై...."

"అటువంటి దెబ్బలూ ప్రమాదాలూ వుంటే విమల మీ వరకూ ఎందుకు తెస్తుంది లెండి. అయినా అతగాడికి పెళ్ళి, భార్యతో వహా స్టేట్స్‌కు వెళ్ళిపోయాక వ్వుడే."

"ఆం"

చలపతి ఆవులించిన నోరు అయిదు నిముషాల వరకూ అలాగే వుండి పోయింది.

"ఇలా విదేశాలూ గట్రా వెళ్ళేవాడని విమల నాకు రాయలేదే?"

యేమో మరి. అతడు అంతగా గొప్పలు పోయే రకం కాదు లెండి. నిండు కుండ. అంతటి పొజిషన్, హంగు వున్నా, కానీ కట్నం లేకుండా పెళ్ళి చేసుకున్నాడు. అందరూ పొగడటమే."

చలపతి చలన రహితం! చాలా తడవు కూర్చోవడం లోనే ఒకనికి కలిగిన విస్పృహ వెల్లడి ఔతోంది.

"అయ్యో. పొరపాటు జరిగిందే!" తనలో తాను గొణుక్కున్నాడు చలపతి.

వెంకటేశ్వర్రావు వినక్లే వుండి పోయాడు.

"నా దగ్గర డబ్బు లోటం ఏమీ లేదు. లీల సంగతి నీకు తెలుసు. మంచి కుర్రాడిని చూడు."

"ఏమిటో! అంతా మంచిగానే కన్పిస్తారు. వెనక సంగతులేమిటో ఎలా తెలుస్తాయి లెండి." బింకంగా అన్నాడు వెంకటేశ్వర్రావు.

"అదీ నిజమే అనుకో. కానీ అలాగనుకుంటే బొత్తిగా పెళ్ళిళ్ళు చెయ్యలేము. కాస్త మనసులో వుంచుకొని చూడు నీకోటి గానీ."

వెంకటేశ్వర్రావు తల పంకించి వూరుకున్నాడు.

"వుంటావా యింకా రెండ్రోజులు?"

"నేనుంటానండి రేపు."

"అయితే నీకూ, నీ స్నేహితుడికీ కూడ రేపు భోజనాలు మా యింట్లోనే. వచ్చేయండి."

"కుదరదండీ." నసిగాడు వెంకటేశ్వర్రావు.

"ఏం?"

"రేపు లంచ్ ఎటూ అక్కడ ఆఫీస్ మెస్‌లో చేసేస్తామనుకోండి. టైము చాలా తక్కువ."

"పోనీ రాత్రి? తీరికగా మాట్లాడుకో వచ్చు."

"సాయంత్రం ఆరూ ఏడు వరకూ ఆఫీసు పనే వుంటుందనుకోండి. వెంటనే మేము రాజమండ్రి బయలుదేరాలి."

"ఎందుకూ? ఇక్కడి నుండి తిన్నగా యింటికి వెళ్ళవా?"

"లేదండీ. మా స్నేహితుడికి - అదే విజయ్‌కి అక్కడేదో సంబంధం వుందనీ చూడమనీ యింటి నుండి వారంరోజుల క్రితమే ఉత్తరం వచ్చిందట. ఒక్కడికీ బిడియంగా వుందని నన్ను తోడు రమ్మన్నాడు."

"అలాగా? ఏ కులసులేమిటీ?"

"మనవాళ్ళేనటండీ."

"ఓహ్! చెప్పావు కాదేం మరీ!" కుర్చీలోనే ఎగిరి గంతేసినంత పని చేశాడు చలపతి.

"ఎందుకండీ?"

"బాగుంది. నే నింతవరకూ చెప్తున్నదేమిటి? మన లీల లేదూ? కుర్రవాడు చక్కగా వున్నాడు. మంచి ఉద్యోగమని అంటున్నావు, ఇంకేం కావాలి?"

ఇబ్బందిగా చూచాడు వెంకటేశ్వర్రావు,

"అతడు మరో అమ్మాయిని చూడడానికి వెళ్తాంటే మనం...... బాగుండదేమో?"

"దానికేముందిలే, పీటల మీద పెళ్ళిళ్ళు కూడా అడ్డం తిరుగుతున్న రోజులాయె."

వెంకటేశ్వర్రావు ఈసారి మరో అభ్యంతరం చెప్పాడు.

"ఆ అబ్బాయికి కోరికలు చాలా వున్నాయండీ మామగారూ...."

"వుండనీయ్. అన్నిటికీ మనం సిద్ధమే. కన్న కూతురికి గాక ఎవరికి యిచ్చేది!"

చలపతిలో సదరు పెండ్లికుమారుని పై మోజు. వట్టుదలా పెరిగినట్లుఅతడి ముఖ కవళికలు స్పష్టంగా చాటుతున్నాయి.

"మన లీలను చూపించితే నష్టమేముంది! పెండ్లి కుదిరితే కుదర వచ్చు, లేదా లేదు. దీనికి తటపటాయింపు దేనికి?"

"తీరా అతగాడు "కాదూ" అంటే లీల చిన్న బుచ్చుకోవచ్చు, మీరు అభిమాన పడవచ్చు, అందుకే నా సంశయం. ఎందుకీ అతిశయం గాళ్ళ చేత మనమూ మన అమ్మాయీ నచ్చ లేదన్పించుకోవాలి?"

"నీకు మాపై గల ప్రేమ అలా మాటలాడింప జేస్తోంది. అటువంటి అభిమానాలూ, కావేషాలూ వుండవని మాట యిస్తున్నాగా?"

"సరేమరి! మీరంతగా చెప్తాంటే...."

5

"మా యింటికి వెళ్ళారా? అంతా బాగా సాయేనా?"

భర్తను చూస్తూనే ప్రశ్నల వర్షం కురిపించేసింది విమల.

"ఆం, ఇదిగో నీకు ఉత్తరం యిచ్చారు"

"చిరంజీవిని విమలకు,

మీ ఆయన పుణ్యమా అని లీలకు చక్కటి సంబంధం కుదిరింది, పెళ్ళికి అట్టే వ్యవధి లేదు, పదిరోజులే గనుక నీవు వెంటనే బయలుదేరి రావాలి.

పెండ్లి పనులంటే మాటాలా? మీ అందరి సహాయం లేనిదే ఎలాగ? వెంటనే నీవు బయలుదేరిరా, అల్లుడు గారు సెలవు మంజూరైనాక వస్తారు.

— చలపతి

"మీరు కుదర్చడ మేమిటి పెండ్లి?" విమల భర్తను అడిగింది.

"నేనక్కడ వుండగానే పెండ్లి చూపులు జరిగాయిలే కానీ - చెప్పు ఎప్పటికి సద్దుకుని తయారవ్వ గలవు? సీటు రిజర్వు చేయిస్తాను".

"సాయంత్రం బండికి"

"అంత త్వరగానా? సరే, పుట్టిల్లా మె మరి!" వెక్కిరింపుగా అన్నాడు. "ఈ క్షణంలో అయినా వెళ్ళిపోగలవు".

రైలు దిగుతూనే ఎదుర్కోలు వచ్చిన పినతండ్రితో మాటలతో పడిన విమల ఆశ్చర్యానికి లోనైంది చలపతి చెప్పిన విషయం విని.

"వరుడు విజయ్ అని ఆయన నకు చెప్పలేదేమిటి? నేనప్పుడు అక్కడ వుండగానే పెండ్లి చూపులయ్యాయిలే అని మాత్రం చెప్పారు!"

"తమాషా చేశాడన్న మాటనీతో" నవ్వేశాడు చలపతి.

పెండ్లికి తరలివచ్చిన వరుని చూసిన విమల మరింత ఆశ్చర్యం చెందిందనేకంటే భ్రమాన్పడి నిలచిందనడం సబబుగా వుంటుంది.

వెంకటేశ్వర్రావూ మరికొందరు సహోద్యోగులూ కూడ పెండ్లికుమారుని తరపు బంధువులుగానే వచ్చారు.

"ఇదేమిటి? పెండ్లి కుమారుడు మారాడేమిటి?" విమల చలపతిని గాభరాగా అడిగింది. "ఇతడేనా లీలకు కుదిరింది?"

"ఔను. ఏం?" చలపతి ఖంగారుగా అడిగాడు.

"పెండ్లికుమారుని పేరు విజయ్ అన్నారు కదా? ఇతడు గోపాల్!"

చలపతి ఆపకుండా అయిదు నిముషాలు నవ్వాడు.

"ఇదేమిటి? నిజంగానే మీ ఆయన నీకు చెప్పలేదా ఏమి? పోనీ శుభలేఖ నువ్వు చూచావుగా? వరుని పూర్తి పేరు విజయ గోపాల కృష్ణ. తెలుసుగా?"

"ఓహో! సాలోచనగా అన్నది.

గోపాల్‌తో లీలకు పెండ్లి!

తాను పందెం కట్టిన గోపాల్!

చలపతి నిరశించి అనుమానించిన గోపాల్!

మరి యిప్పుడు?

'గోపాల్‌ను గప్‌చిప్‌గా తనకు తెలియకుండా చలపతి అల్లుడిగా చేసుకుంటున్నాడు.'

'హమ్మయ్య! ఏమైతేనేం? నా రెండు వేలూ క్షేమం!' అని సంతోషించబోయిన విమల మనసు అంతలోనే చిన్నబోయింది

'అసలు ఈ పద్మ వ్యూహం ఏమిటని? ఈ విషయం భర్త కూడా తన దగ్గర దాచి పెట్టడమేమిటి? అడుగుదామంటే అతడసలు మాటకే అందకుండా, తానేదో పెండ్లి కుమారుని పెద్దన్నగారైనట్లే పోజు పెట్టి కూర్చున్నాడు అతడి దగ్గరే.

రోషంతో ఉడికిపోయిన విమలకు భర్తా, పినతండ్రీ, గోపాల్— అందరూ కూడ తనను ఘోరంగా మోసగించినట్లు అన్పించింది.

వధూవరులు వివాహ వేదిక దిగి లోనికి తీసుకొని రాబడే వరకూ ఎలాగో ఓర్పు వహించింది.

పేర్లు చెప్పించడానికి గుమ్మం వద్ద అటకాయించిన స్త్రీ సమూహానికి కొద్ది దూరంగా నిలబడిన విమలను చూచి పెండ్లి కుమారుడు గోపాల్ అలవోకగా నవ్వాడు.

విమల కోపంగా ముఖం త్రిప్పుకొంది.

"పేరు చెప్పందే వదలం"

వరుసకు మరదలైన ఒక అమ్మాయి దబాయిస్తోంది గోపాల్‌ను.

"ముందు మీ అమ్మాయి చెప్పాలి," బింకంగా అన్నాడు గోపాల్.

"మా యింట్లో ముందు మీరు చెప్పాలి."

"ఎవరు చెప్పినా నిజం చెప్పాలి. అబద్ధపు పేర్లుకాదు." విమల అన్నది చురచుర చూస్తూ.

"మేమెందుకు అబద్ధం చెప్తాం! నాపేరు విజయగోపాల క్రిష్ణ!" కొంటెగా అన్నాడు గోపాల్.

"మీపేరెవరికి క్కావాలి? మా అమ్మాయి పేరు చెప్పండి" ఖచ్చితంగా అన్నారు ఆడవాళ్ళంతా.

"మీ అమ్మాయి పేరూ— విమల గారి చెల్లెలు, ఔనా?" విజయ్ మాటలకు అందరి నవ్వులతో పరిసరాలు మార్మోగాయి.

విమల కూడా నవ్వకుండా వుండలేకపోయింది.

భోజనాలై, అందరూ విడిదిలో విశ్రాంతంగా కూర్చున్న సమయంలో విమలను కబురు పెట్టాడు వెంకటేశ్వర్రావు.

రుసరుసలాడుతూ వచ్చింది విమల,

"బాగుంది. ఇప్పటికా మాటలాడే తీరిక? ఏమిటీ నాటకమంతా? నేనేమైనా అడ్డుపడాతా ననా నానుంచి దాచుడం?"

"అలా కోపం భోంచేయకు గానీ-నిన్ను అమాంతం ఆశ్చర్యం జెందేట్లు చేద్దామని, అంతే, ఎలాగైనా ఈ పెండ్లి జరిగేట్లుచూడమని ఆనాడు నువ్వేగా బ్రతిమాలావు?"

"ఔననుకోండి"

"అటు గోపాల్‌కు కూడ లీలపై బాగా యిష్టమూ, మీ చిన్నాన్నగార్ని ఓడించాలనే పంతమూ కలిగాయి.

నీకు చెప్తే "మా బాబాయితోనా యీ పరాచికాలు?" అని ఆదిలోనే అభ్యంతరం చెప్పగల ప్రమాదమున్నది గనుక నీకు మా పథకం చెప్పలేదు .... .... తేరగా వచ్చే వరునిపై లక్ష అనుమానాలు పుట్టుకొచ్చిన మీ బాబాయికి, వరుడు లక్షల శిఖరంపై వున్నాడనే సరికి ఏ అనుమానమూ రాకపోగా ఆ అందని అందలంపై ఎలాగైనా తన కూతుర్ని కూర్చుండజేయాలనే మోజూ పట్టుదల కలిగింది!"

అంత వరకూ చిరునగవుతో మౌనంగా వున్న గోపాల్ మాట్లాడాడు.

"ఇంతకూ మీరు పందెం ఓడిపోయారు!"

"అదేం లేదు. నేను చెప్పిన లీలనేగా మీరు వివాహ మాడారు? బింకంగా అడిగింది విమల.

"చిన్న సవరణ వదిన గారూ, మీరు చెప్పినది "లీల" మాత్రమే; నేను చేసుకున్నది "లీల ప్లస్ కట్నం" అసలు మన పందెమే అది కదా! మీరే యిస్తారో, మీ బాబాయి చేత యిప్పిస్తారో మరి – మీరు ఓడిపోయిన రొక్కం యివ్వాల్సిందే!"

విషయం తెలిసిన చలపతి ఏ మాత్రం అభిమాన పడలేదు. తేలికగా, మనస్ఫూర్తిగా నవ్వేశాడు.

"ఇదిగో విమలా నీకు నా బహుమతి రెండు వేలు – అల్లుడిగారికి రెండు వేలు ఇంత మంచి సంబంధం తెచ్చి శ్రమ తీసుకున్నందుకు, సరేనా?"

"ఇదిగో బాబూ మీకు నేను ఓడిపోయిన పైకం," అంటూ విమల యిచ్చిన రెండు వేలూ అందుకని, దానికి మరో నూటపదహారు జత చేసి తిరిగి విమల చేతుల్లో వుంచేశాడు గోపాల్.

"ఇది మీకు నా తరపు నుండి బహుమతి! ఒక చిన్న సలహా కూడ యిస్తాను – పుచ్చుకోండి: లోకం తీరు తెలియని మీరు ఎప్పుడూ ఎవ్వరితోనూ యిలా పందెం కాయకండి!"

✱

జ్యోతి